

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం

14 సెప్టెంబర్ 2025 పేజీలు : 08






## ఆత్మకూరు గురుకుల పాఠశాలలో విషజ్వరాలపై
# తక్షణ చర్యలకు మంత్రి ఆనం ఆదేశం

- జిల్లా కలెక్టర్, అధికారులతో గ్రూప్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి
- మంత్రి ఆనం ఆదేశాలతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- ఆత్మకూరుకు కదిలిన వైద్య బృందాలు
- జిల్లావ్యాప్తంగా విద్యాలయాల్లో ఎలాంటి వర్షాకాల వ్యాధులు ప్రబలకుండా పిల్లల ఆరోగ్యం పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- మంత్రి ఆనం ఆదేశం

నెల్లూరు, మేజర్‌న్యూస్ :

ఆత్మకూరు బాలికల గురుకుల పాఠశాలలో విషజ్వరాల కలకలంపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తక్షణమే స్పందించారు. విష జ్వరాల సమాచారం తెలియగానే మంత్రి అధికారులను అప్రమత్తం చేసి విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఆదేశించారు.

ఆత్మకూరు గురుకుల పాఠశాల -మిగతా 2లో




## కేరళ మంత్రిని కలిసిన కమిషనర్ నందన్

నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :

కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కేరళ అర్బన్ కాంక్లేవ్ సమావేశంలో నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ శనివారం పాల్గొన్నారు. రాష్ట్ర తొలి సమగ్ర పట్టణ విధానాన్ని రూపొందించడానికి నిర్వహించిన కేరళ అర్బన్ కాంక్లేవ్ 2025 కొచ్చి ప్రాంతంలోని గ్రాండ్ హయత్ కన్వెన్షన్ సెంటర్లో రెండు రోజులపాటు నిర్వహించారు. "ఆకాంక్షించే నగరాలు, అభివృద్ధి చెందు సమాజాలు" అనే థీమ్‌తో నిర్వహించిన ఈ సమావేశంలో చివరి రోజు కేరళ రాష్ట్రం లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్, ఎక్సైజ్ అండ్ పార్లమెంటరీ అఫైర్స్ మంత్రి ఎం.బి రాజేష్‌తో కమిషనర్ మర్యాద పూర్వకంగా కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

## నెల్లూరుకు కొత్త ఎస్పీగా
# అజిత వేజెండ్ల

ఎస్పీ కృష్ణకాంత్ బదిలీ..



08 పేజీలో

## జైలు జీవితం గడిపినా..

వివరాలు 2లో

# తీరు మారని కాకాణి

- కాకాణికి పట్టింది బలుపు కాదు.. కొవ్వు !
- పీఏసీఎస్ చైర్మెన్ మస్తాన్ బాబు ఎద్దేవా



## ప్రజా సమస్యల పరిష్కారానికే

04

# మొదటి ప్రాధాన్యత



నూతన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టరుగా హిమాన్షు శుక్లా శనివారం బాధ్యతలు స్వీకరించారు.

# జైలు జీవితం గడిపినా.. తీరు మారని కాకాణి

## కాకాణికి పట్టింది బలుపు కాదు కొవ్వు - పీఏసీఎస్ చైర్మన్ మస్తాన్ బాబు ఎద్దేవా




**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** జైలు జీవితం గడిపినా.. కాకాణి తీరులో మార్పు రాలేదని, ఆయన ఒంటికి పట్టింది బలుపు కాదు.. కొవ్వు అని పొదలకూరు పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్ బాబు ఎద్దేవా చేశారు. పొదలకూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అజ్ఞాతవాసం, అరణ్యవాసం ముగించుకొని జన జీవన స్రవంతిలోకి వచ్చిన కాకాణి నడవడికలో మార్పు రాలేదన్నారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడడం, హేళనగా మాట్లాడడం కాకాణికి అలవాటైపోయిందన్నారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడడం మంచి పద్ధతి కాదని, అలా మాట్లాడాల్సి వస్తే తాము కూడా చాలా మాట్లాడగలమని హితవు పలికారు. సర్వేపల్లి ప్రజలు ఒక పక్క ఛీదరించుకుంటున్నా.. అతని తీరులో మార్పు కనిపించడం లేదన్నారు. సోమిరెడ్డి ఫ్యాన్ గాలికి ఎగిరిపోతాడని, తాను తిని బలంగా ఉన్నానంటున్నారన్నారు. కాకాణికి పట్టింది బలుపు కాదు.. కొవ్వు అనేది గ్రహించాలన్నారు. జిల్లాలో యూరియా పుష్కలంగా అందుబాటులో ఉందని, పంటలు కోత కోసే సమయంలో యూరియా అవసరం రైతుకు ఏముందని, అంత మాత్రం జ్ఞానం కూడా కాకాణికి లేదా.. అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వంలో ముఖాలు చూసి వాళ్ళ పార్టీ వారికే యూరియా పంపిణీ చేశారని, ఆ పరిస్థితి ఇప్పుడు లేదన్నారు. ఎవరికి అవసరమైతే వారు నేరుగా తీసుకునే అవకాశం కూటమి ప్రభుత్వం కల్పించిందన్నారు. గత ప్రభుత్వంలో పొదలకూరులో అధికారులు.. తెలుగుదేశం పార్టీ వారికి యూరియా బస్తాలు ఇచ్చారని, వారిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేసిన ప్రబుద్ధులు తమరన్న విషయం గ్రహించాలన్నారు. కాకాణి ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పి అదే నిజమనేలా వ్యవహరిస్తున్నారని, ఆయన మాటలు సర్వేపల్లి ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. కాకాణి జీవితంలో ఇక సర్వేపల్లిలో విజయం సాధించలేడని జోష్యం చెప్పారు. సమావేశంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పల్లారపు కృష్ణ, పట్టణ టిడిపి అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ వెంపులూరు అరుణ, ఏఎంసీ డైరెక్టర్ అక్రైమ్ సుధాకర్ రెడ్డి, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, టిడిపి సీనియర్ నాయకులు కలిచేటి ప్రభాకర్ రెడ్డి, యత్తపు వెంకటరెడ్డి, షేక్ ఖాదర్ బాషా, కలిచేటి శ్రీనివాసులు రెడ్డి, పులిపాటి వెంకటరత్నం నాయుడు, పెంచలనాయుడు, అలుపూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపిన శివాజీ సెంటర్ వ్యాపారస్తులు




**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** స్థానిక ట్రంకురోడ్డు నడిబొడ్డు ముఖ్య వ్యాపార కూడలైన శివాజీ సెంటర్‌లో శివాజీ విగ్రహం వద్ద శనివారం భారత ప్రధాని నరేంద్ర మోడీ, భారత ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ చిత్రపటాలకు నగర పలు వ్యాపార సంస్థల నాయకులు కృతజ్ఞతతో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. సులభతరమైన వాణిజ్య జీఎస్టీ తగ్గింపు ఫలాలను ప్రజలందరికి జిఎస్టి2 సంస్కరణలతో భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ దేశ ప్రజలకు అందిస్తున్నారన్నారు. రెండు స్లాబుల ద్వారా పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థికభారం తగ్గి పొదుపు చేసే వీలుందన్నారు. ప్రజలందరికీ ఆరోగ్యం కోసం ఆరోగ్య జీవిత బీమా పాలసీలపై వస్తు సేవా జీఎస్టిని పన్ను లేకుండా ప్రజలందరికీ ఆరోగ్య భద్రతను కల్పిస్తున్నారన్నారు. ప్రభా మెడికల్స్ అధినేత శ్రీనివాసులు మాట్లాడుతూ.. మెడికల్ డయాగ్నిక్స్ వస్తువులపై 18 శాతం నుంచి 5 శాతంకు తగ్గించడం, లైఫ్ సేవింగ్ డ్రగ్స్‌పై కనీస పన్ను కూడా లేకుండానే ప్రజలందరికీ అందిస్తున్న నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. వెంకట్రామా పుస్తకాల షాపు అధినేత సత్యనారాయణ మాట్లాడుతూ.. పుస్తకాలు అన్ని రకాల సామాగ్రిపై పన్ను లేకుండా చేయడం భారత దేశ చరిత్రలో నరేంద్ర మోడీకి మాత్రమేసాధ్యమైందన్నారు. వస్త్ర వ్యాపారుల సంఘాల ప్రతినిధి ప్రసాద్ మాట్లాడుతూ.. వస్త్రాలపై జిఎస్టి అతి తక్కువ శాతం విధించడం హర్షనీయమన్నారు. అదేవిధంగా ఆటోమొబైల్ రంగంలో వ్యవసాయ ట్రాక్టర్ ఉపకరణాలపై 5 శాతం, గృహ నిర్మాణం పనులకు సిమెంటు తగ్గడం హర్షనీయమన్నారు. శివాజీ సెంటర్ మిత్రులు కెవి సుబ్రహ్మణ్యం, బిఎస్ రంగరాజన్, హర్షవర్ధన్, భాస్కరరావు, మధుసూదన్, పలువురు మోడీ అభిమానులు కృతజ్ఞతగా క్షీరాభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ఆత్మకూరు గురుకుల పాఠశాలలో విషజ్వరాలపై

## తక్షణ చర్యలకు మంత్రి ఆనం ఆదేశం

*(మొదటి పేజీ తరువాయి)*

ఘటనపై నెల్లూరులోని క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, అన్నిస్థాయిల అధికారులతో మంత్రి అత్యవసరంగా గ్రూప్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి చేపట్టాల్సిన చర్యలపై సూచనలు.. ఆదేశాలిచ్చారు. మంత్రి ఆనం ఆదేశాలతో సమాయత్తమైన వైద్యారోగ్య, రెవెన్యూ, పోలీసు అధికారులు ఆత్మకూరు గురుకుల పాఠశాలకు తరలివెళ్లి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఏ ఒక్క విద్యార్థికి కూడా ఇబ్బంది కలగకుండా చూడాలని మంత్రి ఆనం అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. వైద్యులు జ్వరాల బారిన పడిన విద్యార్థినులకు సమీపంలో ఉండే జిల్లా వైద్యశాలకు తరలించి తక్షణ వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం జ్వరాల బారినపడిన విద్యార్థునుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలలు, హాస్టళ్లలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, స్వచ్ఛమైన తాగునీటిని విద్యార్థులకు అందించాలని సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఆనం హెచ్చరించారు. జిల్లా రెవెన్యూ అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, పబ్లిక్‌హెల్త్ ఎస్ఈ, సోషల్ వెల్ఫేర్ డీడీ, ఐటీడీఏ పీఓ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, రెసిడెన్షియల్ స్కూల్స్ డీసీఓ, డీఈఓ, ఆత్మకూరు డీఎస్పీ, ఆర్డీవో, పలు విద్యాలయాల ప్రిన్సిపల్స్‌తో పాటు ఆత్మకూరులోని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్, స్థానిక అధికారులకు ఈ టెలి కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి ఆనం సూచనలు జారీ చేశారు. స్థానిక ఎన్డీయే కూటమి నేతలు, మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

## పోటాపోటీగా పీఆర్ ఉద్యోగుల ఆటల పోటీలు




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ప్రముఖ ఇంజనీర్ దివంగత మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని నిర్వహించే ఇంజనీర్స్ డే వేడుకల్లో భాగంగా నెల్లూరు నగరంలో ఏసి స్టేడియంలో పంచాయతీరాజ్ ఇంజనీర్లకు సంబంధించి శనివారం ఆటలు పోటీలు ప్రారంభమయ్యాయి. పంచాయ తీరాజ్ ఎస్ఈ కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ పోటీలను ప్రారంభించారు. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, క్యారమ్స్, చెస్, రింగ్‌బాల్, పరుగు పందాలను ఉద్యోగులకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. నిత్యం పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు మానసిక ఉల్లాసం కోసం ఈ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. జేఏసీ ఛైర్మన్ బాబురావు, నిర్వహణ కమిటీ కార్యదర్శి షేక్ ఖాదర్ బాషాను ప్రసంసించారు. వివిధ ఆటల పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. కార్యక్రమంలో పంచాయితీరాజ్ ఏఈలు సత్యనారాయణరెడ్డి, సుబ్బరాజు, చంద్రారెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

## తన బిడ్డను దొంగచాటుగా తీసుకుపోయేందుకే వచ్చాడు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జెండా వీధికి చెందిన హర్షియాకు చెన్నైకి చెందిన రసూల్ బాషాతో వివాహం 2015 సంవత్సరంలో జరిగిందని బాధితురాలు చెప్పారు. శనివారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హర్షియా మాట్లాడుతూ.. తన భర్తకు తన తల్లిదండ్రులు సుమారు 7 లక్షల కట్నం, 20 సవర్లు బంగారం ఇచ్చి పెళ్లి చేశారని చెప్పారు. అయినా అదనపు కట్నం కోసం తమ అత్తమామలతో కలిసి తన భర్త రసూల్ బాషా వేధించడంతో తాను పురిటి బిడ్డతో సహా నెల్లూరుకి వచ్చేయడం జరిగిందన్నారు. తనను అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని నెల్లూరు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, అప్పుడు వచ్చి నా భర్త, అత్తమామలు తనను రాజీ చేసి తీసుకెళ్లడం జరిగిందన్నారు. తాను కేసు పెట్టాననే కక్షసాధింపుతో ఆరోజు నుండి నన్ను ఒక రూమ్‌లో బంధించి చిత్రహింసలు పెట్టడం మొదలుపెట్టారని, అక్కడి నుండి నా బిడ్డతో సహా నెల్లూరుకి వచ్చేసి కోర్టులో కేసు వేయడం జరిగిందని వివరించారు. శుక్రవారం మా రెండు కుటుంబాలు కోర్టుకి హాజరు కావడంతో తనకు తెలియకుండా నా బిడ్డను తీసుకువెళ్లే ప్రయత్నం చేశారని తెలిపారు. అంతే కాకుండా తన భర్త కోర్టులో కేసు ఉండగా, మరొక పెళ్లి చేసుకున్నారని ఆరోపించారు. తనకు తన భర్త నుండి ఇంతవరకు విడాకులు కాలేదని, కేవలం కోర్టులో కేసు జరుగుతుందన్నారు. ఈ విషయంపై పోలీస్ అధికారులు ఎంక్వయిరీ చేసి తనకు న్యాయం చేయాలని కోరారు. అంతేకాకుండా వాయిదాకు వచ్చిన తన భర్త.. కొంత మంది వ్యక్తులతో వచ్చి తన బిడ్డను తీసుకుని వెళుతుండగా అడ్డుపడడంతో అత్తమామలు, నా భర్త నన్ను తోసేశారన్నారు. సమావేశంలో అమీనా పాల్గొన్నారు.

## ఘనంగా రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలు



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ పద్మజా యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పద్మజా యాదవ్ మాట్లాడుతూ.. బీసీలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఎన్నికలకు ముందు కుల గణన చేస్తామని ప్రధాని నరేంద్ర మోడీ హామీ ఇచ్చారని, దేశవ్యాప్తంగా దీనిని చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిసి సీనియర్ నేత అన్నంగి రమణయ్య, నడవడి ముత్యం గౌడ్, ముంగర శైలజ, డిఆర్ ఇందిరా, నక్క దినేష్, వల్లపు రజిని, ఉడతా శైలజ యాదవ్, సుష్మ, మన్యం రాము గౌడ్, పడాల గోపాల్ యాదవ్, నర్మదాబాయి, వల్లపు వెంకటేశ్వర్లు, తరుణ్, గుంజు సుధాకర్, పాలకుర్తి శ్రీనివాసులు, దేవరాల వెంగయ్య, మల్లికార్జున్, ఆదూరి శ్రీధర్, గోపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలకు తరలిన జిల్లా, డివిజన్ అధికారులు





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని బాలికల గురుకుల పాఠశాలలో పలువురు విద్యార్థినిలకు విషజ్వరాలు ప్రబలాయన్న ప్రచారం, సమాచారంతో రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ హిమాన్ష్‌శుక్లా, ఇతర అన్ని శాఖల అధికారులతో టెలికాన్ఫ్‌రెన్స్ నిర్వహించడంతో జిల్లా, డివిజన్, మండల అధికారులు పాఠశాలకు తరలివచ్చారు. తెలుగుదేశం నాయకులు కూడా పాఠశాలకు చేరుకున్నారు. జిల్లా జాయింట్‌కలెక్టర్ కార్తీక్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ సుజాత, డిప్యుటి డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, స్తానిక ఆర్డీవో భూమిరెడ్డి పావని, తహశిల్దారు పి.పద్మజాకుమారి, మున్సిపల్ కమీషనర్ సి.గంగాప్రసాద్, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్, ఐటిడిఏ, బిసికార్పోరేషన్, విద్యాశాఖ తదితర శాఖల అధికారులు కూడా విచ్చేశారు. జ్వరాలు సోకిన విద్యార్థినిలను పరిశీలించారు. ఇతర విద్యార్థినిలతో వారు మాట్లాడారు. పాఠశాల ఆవరణ, గదులు, వంటశాల, మరుగుదొడ్లు తదితరాలను పరిశీలించారు. జ్వరాలు సోకిన వారిని హాస్పిటల్‌కు తరలించారు. విద్యార్థినిలకు, ప్రిన్సిపాల్‌కు, ఉపాధ్యాయులకు పలు జాగ్రత్తలు సూచించారు. మంత్రి ఆనం ఆదేశాలతో తెలుగుదేశంకు చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, పట్టణ టిడిపి అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, జిల్లా తెలుగుయువత నాయకుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, కౌన్సిలర్ శివకోటారెడ్డి, టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుడు నెల్లూరు శివారెడ్డి తదితరులు విద్యార్థులను పరిశీలించారు. మంత్రి ఆనం కుమార్తె లీలాకైవల్యారెడ్డి స్పందించి సమకూర్చిన పౌష్టికాహార పధార్ధాలను వారు విద్యార్థినిలకు పంపిణీ చేశారు. అందరికి తగు జాగ్రత్తలు తెలిపారు. కాగా అత్యధికంమంది విద్యార్థినిలకు విషజ్వరాలు సోకలేదని, అనుమానంతో 11మందిని హాస్పిటల్‌కు పంపామని, నలుగురికి మాత్రమే జ్వరాలు సోకాయని, అన్నీ జాగ్రత్తలు తీసుకున్నామని పాఠశాల వర్గాలు చెబుతున్నారు. కాగా 40మంది విద్యార్థినిలకు జ్వరాలు సోకగా 20మందిని ఇళ్ళకు పంపామని, 20మందికి ఇక్కడే చికిత్స చేయిస్తున్నామని, సమీపంలో డంపింగ్‌యార్డు వలన జ్వరాలు సోకాయని ప్రిన్సిపల్ తెలిపారు. శుక్రవారం నుండే కమీషనర్ పరిసరాలను శానిటైజ్ చేయించారని, వైద్య సిబ్బంది మెడికల్‌క్యాంప్ ఏర్పాటు చేశారని తెలిపారు.

**ఒకపక్క అవినీతిపై విచారణ..**

# మరోపక్క అక్రమాలు దాచేందుకు నిర్మాణాలు

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరులో జగనన్న కాలనీలలో అక్రమాలపై రెండు రోజులుగా విచారణ జరిగింది. సీఎంఓ కార్యాలయ ఆదేశాలతో సదరు విచారణ జరిగినట్లు సమాచారం. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రస్తుత తిరుపతి పిడి దయాకర్‌కు గురువారం నెల్లూరులో విచారణకు రావాలని అధికారులు ముందస్తు సమాచారం ఇచ్చారు. సదరు అధికారి విచారణకు రాకపోగా తన కుటుంబంలో ఒకరికి ఆరోగ్యం బాగోలేదని వైద్య సేవలు నిమిత్తం హాజరు కాలేనని దయాకర్ తెలిపినట్లు సమాచారం. హౌసింగ్ అక్రమాలపై ఫిర్యాదు చేసిన బిజెపి నేత మిడతల రమేష్ ఫిర్యాదు అంశాల మేరకు కొండలపూడి లేఅవుట్లో పరిశీలనకు విచారణ అధికారులు వెళ్లారు. ఆ సమయంలో అక్రమాలు వలన నిధులు దుర్వినియోగం అయినట్లు పేర్కొన్న గృహాల వద్ద పనులు జరుగుతూ ఉండడం చూసి అధికారులు ఆశ్చర్యానికి లోనయ్యారు. హౌసింగ్ కార్పొరేషన్ హెడ్ ఆఫీస్‌లో పనిచేస్తున్న అధికారి విచారణ అంశాలను దయాకర్‌కు సమాచారం ఇచ్చారని హౌసింగ్ కార్యాలయంలో గుసగుసలాడుకుంటున్నారు. వైద్యం పేరుతో కావాలని దయాకర్ రాలేదని ఆయన కాళహస్తిలో ఉన్నాడని విచారణ అది కాదు గుర్తించారు. శుక్రవారం ఫిర్యాదుదారుడైన రమేష్‌ను పలు అంశాలపై విచారించారు. కొండ్లపూడిలో రూఫ్ లెవెల్ నిర్మాణాలకు ఆన్లైన్లో కంప్లేషన్ నమోదు చేసి ఫైనల్ బిల్లు ఇచ్చిన గృహాలకు స్లాబ్‌ల నిర్మాణం ఆ సమయంలో జరుగుతున్నట్లు సమాచారం అందింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి లేకుండా జరిగే విచారణకు విలువ ఉండదనే అంశాన్ని తెరపైకి తేవడానికి వ్యూహాత్మకంగా దయాకర్ హాజరు కాలేదని తెలుస్తోంది. విచారణకు డుమ్మా కొట్టడం. ఆ సమయంలోనే అక్రమాలు తప్పిదాలను కపిపుచ్చేటట్లు దయాకర్ వ్యవహరించినట్లు బిజెపి నేత రమేష్ హౌసింగ్ అధికారుల తీరు పట్ల అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దయాకర్ పనిచేసే లేఔట్లలో ఒప్పంద పత్రాలలో సాంకేతిక పరమైన అంశాలు ఏవి చూపించకుండా ఒప్పంద పత్రాలు అర్ధ రహితంగా ఉంటాయని రమేష్ ఈ సందర్భంగా అధికార దృష్టికి తీసుకువచ్చారు. తిరుపతి జిల్లా పీడీగా ఉన్న దయాకర్ కనుసన్నల్లో తిరుపతి అర్బన్ లేఔట్‌లలో నిర్మాణాలు పరిశీలను పరిశీలిస్తే ఒక అవగాహనకు రావచ్చని అమరావతి నుండి వచ్చిన ప్రత్యేక అధికారి బృందం తిరుపతికి బయలుదేరి వెళ్లినట్లు సమాచారం.

# ఆదాల నమ్మించి.. మోసం చేశారు..

- ఎన్నికల్లో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని తిట్టేందుకు 40లక్షలతో ఛానల్ పెట్టించారు
- అవసరం తీరిపోగానే నన్ను డబ్బు కట్టమని నన్ను బెదిరించారు
- ఆదాల పీఆర్ఓ వెంకటస్వామి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** మాజీ పార్లమెంటు సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఆదాల ప్రభాకర్‌రెడ్డిపై ఆయన పీఆర్‌ఓగా పని చేస్తున్న వెంకటస్వామి సంచలన ఆరోపణలు చేశారు. నెల్లూరు నగరంలోని బిఆర్ అంబేద్కర్ భవన్లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నమ్మిన వాళ్లను మోసం చేయడంలో ఆదాల దిట్టని ధ్వజమెత్తారు. ఆదాల ఒక నయ వంచకుడు మోసగాడని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సార్వత్రిక ఎన్నికల్లో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని నిరంతరం తిట్టాలన్న లక్ష్యంతో కల్లూరు లక్ష్మీరెడ్డితో కలిపి ఒక ఛానల్ పెట్టించాడని, సుమారు 40లక్షల రూపాయలు ఖర్చయిందని నిరంతరం కోటంరెడ్డిని లక్ష్యంగా చేసుకొని తిట్టడమే ఈ ఛానల్ పని అని తెలిపారు. అలాగే సోషల్ మీడియాలో కూడా కోటంరెడ్డి పై అనేక జిగుప్సాకరంగా కారంగా పోస్టింగులు చేయించారన్నారు. నేడు అవసరం తీరిపోగానే ఆదాల ప్రభాకర్ రెడ్డి రౌడీల చేత నన్ను కొట్టించి ఖాళీ ప్రామిసరీ నోట్ల చేత సంతకాలు చేయించుకున్నాడని ఆరోపించారు. ఛానల్ ఏర్పాటు చేసేందుకు ఖర్చు అయిన 40లక్షల రూపాయలు చెల్లించాలంటూ తనపై కేసు పెట్టించారన్నారు. నమ్మిన వాళ్లని మోసం చేసి నయవంచకుడిగా మారిన ఆదాల ప్రభాకర్ రెడ్డిని ఎవరు నమ్మవద్దన్నారు. గత కొన్ని సంవత్సరాలగా ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఆదాల ప్రభాకర్ రెడ్డి కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోసం తాను పనిచేస్తే తనపైనే ఆదాల ప్రభాకర్ రెడ్డి కల్లూరు లక్ష్మీరెడ్డి చేత పెట్టించారని తనకు న్యాయం చేయాలని కోరారు.

## సాగునీటిసంఘ డైరెక్టర్ గున్నం మృతి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు చెరువు సాగునీటిసంఘ డైరెక్టర్ ఆర్‌ఎస్‌ఎస్ పూర్వనాయకుడు, బిజెపి సీనియర్ నాయకుడు గున్నం నరశింహారెడ్డి(65) శనివారం మృతి చెందాడు. ఆయన అనారోగ్యంతో కొంతకాలంగా బాధపడుతూ.. మృతి చెందాడు. ఆత్మకూరు మండలం నువ్వురుపాడుకు చెందిన నరశింహారెడ్డి గత డిసెంబర్‌లో జరిగిన సాగునీటిసంఘ ఎన్నికల్లో డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఆయన తొలినుండి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తగా, ఖండ నాయకుడుగా ఉంటూ బిజెపి నాయకుడుగా కొనసాగుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తమ తండ్రి అంత్యక్రియలు ఆదివరాం ఉదయం నువ్వురుపాడులోని తమ స్వగృహం వద్ద జరుగుతాయని ఆయన కుమారుడు గున్నం హరికిషోర్‌రెడ్డి (జయభారత్‌హాస్పిటల్ ఉద్యోగి) పేర్కొన్నారు. ఎంతో సౌమ్యుడుగా, వాగ్ధాటికలిగిన వక్తగా ఆయన పేరుగాంచారు. ఆయన మృతికి ఆంధ్రప్రదేశ& రెడ్డి సంఘ జిల్లా అధ్యక్షుడు, తెలుగుదేశం క్లస్టర్ ఇన్‌చార్జ్ కొండ్రెడ్డి రమణారెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తంచేసి ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.నరశింహారెడ్డి మృతికి పలువురు బిజెపి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

## పెన్నా పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**సంగం, మేజర్‌న్యూస్ :** నేడు (14/9/25) ఆదివారం మంత్రి సోమశిల గేట్లు ఎత్తివేయుచున్నందున సంఘం మండలంలోని వీర్ల గుడిపాడు, కోలగట్ల, పడమటిపాలెం, జండా దిబ్బ, అన్నా రెడ్డిపాలెం, సిద్దిపురం, మక్తాపురం, వెంగారెడ్డి పాలెం గ్రామాలలోని ప్రజలను అప్రమత్తంగా ఉండవలసిందిగా సంబంధిత పంచాయతీ కార్యదర్శులు మీ మీ గ్రామాల్లో దండోరా వేయించండి, పంచాయతీలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టండని ఎంపీడీవో ఒక ప్రకటనలో తెలియజేశారు.

## చెర్లోయడవల్లిలో ఉచిత వైద్యశిబిరం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లిలో శనివారం ప్రత్యేక మెగా ఉచితవైద్యశిబిరాన్ని నిర్వహించగా బెంగుళూరుకు చెందిన వైద్యనిపుణులు డాక్టర్ మాదమాల ప్రమీల ప్రజలకు వైద్యపరిక్షలు నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్, మండల తెలుగుదేశం ప్రధానకార్యదర్శి కేతా విజయభాస్కరరెడ్డి ప్రత్యేక చొరవ,శ్రద్ధతో ఆరేడు సంవత్సరాలుగా తమ సమీపబంధువు డాక్టర్ ప్రమీల ద్వారా రెండు నెలలకొకదపా ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం, ప్రజలకు వైద్యపరిక్షలు నిర్వహించడం, మందులు ఉచితంగా అందించడం సాగుతోంది. శనివారం నిర్వహించిన శిబిరంలో 158మందికి వైద్యపరిక్షలు నిర్వహించి మందులను కూడా ఉచితంగా అందజేశారు. షుగర్, బిపి వ్యాధిగ్రస్థలకు రెండునెలలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీచేశారు. ఈసందర్భంగా డాక్టర్ ప్రమీల ప్రజలకు ఆరోగ్యం గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలగురించి అవగాహన కల్పించారు. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదని ఆమె సూచించారు. కేతా విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ తమ గ్రామస్థులు ఆరోగ్యవంతంగా ఉండాలన్న లక్ష్యాంగా తనవంతుగా చొరవతీసుకొని డాక్టర్ ప్రమీలద్వారా వైద్యశిబిరాలను కొనసాగిస్తున్నానన్నారు. ఈ శిబిరాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని విజయభాస్కరరెడ్డి కోరారు. ఈకార్యక్రమంలో చెర్లోయడవల్లి సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు షంషాద్‌బేగమ్, రాజేశ్వరి,ఆశాకార్యకర్త కాంతమ్మ, ఆదిలక్ష్మమ్మ, కామిరెడ్డి అశోక్, కోలా హజరత్, పెంచలయ్య, అంబటి రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. క్రమం తప్పకుండా తమ ఆరోగ్యంకోసం ఉచిత వైద్యశిబిరాలను నిర్వహిస్తున్న డాక్టర్ ప్రమీల, నిర్వాహకులు కేతా విజయభాస్కరరెడ్డిలకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరించిన ప్రభుత్వం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** సూపర్ సిక్స్.. సూపర్ హిట్.. కార్యక్రమాలు జరుపుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ పథకాలు ప్రజలకు అందడానికి వారధులైన ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరించిందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ పేర్కొన్నారు. శనివారం స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో రణభేరి ప్రచారయాత్ర కార్యక్రమంపై ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పాలనలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతగానో నష్టపోయారన్నారు. ఈ ప్రభుత్వం సైతం ఏర్పడి 14నెలలు పూర్తయినా పీఆర్సీ, ఐఆర్, డీఏలు, ఆర్థిక బకాయిలు చెల్లింపు, ఉపాధ్యాయుల బోధనేతర కార్యక్రమాల రద్దు తదితర సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. అందులో భాగంగా యూటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు రణభేరి ప్రచారయాత్రకు పిలుపునిచ్చిందన్నారు. 17న ఉదయగిరిలో చేపట్టే రణభేరిప్రచారయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అప్పటికీ కూడా ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 25న చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు. అనంతరం యాత్రకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ నాయకులు ఈ తిరుపతయ్య, కె.చంద్రశేఖర్‌రెడ్డి, షేక్ నాయబ్, జీ.సుబ్బారెడ్డి, షేక్ హనీప్, భోగ్యం శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, మున్నా, రామకృష్ణ నస్రుల్లా, సుబ్రహ్మణ్యం, ఉపాద్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గడప గడపకు దూదేకుల కార్యక్రమం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** గడప గడప దూదేకుల కార్యక్రమంలో భాగంగా నెల్లూరు నగరం 3వ వార్డ్, 4వ వార్డ్ కిసాన్ నగర్‌లో ఉన్న దూదేకుల కులస్తుల ఇంటికి వెళ్లి, వారి సమస్యలు, తెలుసుకొనడం జరిగింది. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కుల సర్టిఫికెట్‌ల సమస్యను పరిష్కరించుటకు గడప గడపకు కార్యక్రమం సందర్భంగా వారికి దూదేకుల సంఘం తరపున కుల సర్టిఫికెట్ అందచేస్తామని లేని వారు తప్పని సరిగా కుల సర్టిఫికెట్ పొందాలని తద్వారా మన దూదేకుల జనాభా ఎంత ఉందో తెలుస్తుంది అని తెలియజేశారు. రాష్ట్రంలో 20లక్షల మంది దూదేకుల కులస్తులు ఉన్నారని కానీ ప్రభుత్వ లెక్కలలో కేవలం 452000 మాత్రమే ఉన్నారని, అలాగే నెల్లూరు నగరం, రూరల్‌లో దాదాపు 25000 మంది దూదేకుల కులస్తులు ఉన్నారని వీరందరి వివరాలు సేకరించి ప్రభుత్వ అధికారులకు నివేదిక ఇస్తామని తెలియజేశారు. వీరిలో ఎక్కువమంది దూదేకుల కార్పొరేషన్ ద్వారా లోన్ల కొరకు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం త్వరలో దూదేకుల కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చెయ్యాలని కోరుతున్నారు. దూదేకుల సామాజిక వర్గానికి ఏంఎల్‌సిలుగా అవకాశం ఇవ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దూదేకుల కులస్తులలో చైతన్యం తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సలీమ్, గౌరవ అధ్యక్షులు షేక్ మహబూబ్ పాషా, ప్రధాన కార్యదర్శి షేక్ మీరా సాహెబ్, స్థానిక దూదేకుల నాయకులు షేక్ రసూల్, మస్తాన్ సాహెబ్, పెద్ద ఖాసీం, మీరావలి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యత

- నన్ను కలిసేందుకు అపాయింట్మెంట్ అవసరం లేదు
- నూతన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా





**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని నూతన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. శనివారం సాయంత్రం నెల్లూరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టరుగా హిమాన్షు శుక్లా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రంకోసం తమ ప్రాణాల్ని అర్పించిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు పేరుమీద ఏర్పడిన నెల్లూరు జిల్లాకు కలెక్టర్‌గా రావడం సంతోషంగా ఉందన్నారు. గతంలో జిల్లా కలెక్టర్లుగా ఎంతోమంది గొప్పగా పనిచేసి జిల్లా అభివృద్ధికి పాటుపడ్డారని, వారి స్ఫూర్తితో పనిచేసి అభివృద్ధిని కొనసాగిస్తా మన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఇతరుల సమన్వయంతో జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియా గణనీయమైన పాత్ర పోషించాలని, ప్రభుత్వం చేసే మంచి పనులను అందరికీ తెలియజేయాలన్నారు. 2013 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన హిమాన్షు శుక్లా , విశాఖపట్నం అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకుని మొదటి పోస్టింగ్ తిరుపతి సబ్ కలెక్టర్‌గా పనిచేశానని, అనంతరం టూరిజం డైరెక్టర్‌గా, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల జాయింట్ కలెక్టర్‌గా, డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌గా పనిచేశానన్నారు. అనంతరం రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులుగా పనిచేస్తూ నెల్లూరు జిల్లాకు నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టానని వివరించారు.

# బాలికల వసతిగృహంలో వైద్య శిబిరం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో శనివారం చాకలికొండ వైద్యాధికారి మురళీధర్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి బాలికలకు వైద్య పరిశ్రమ నిర్వహించారు. వారిలో ముగ్గురు బాలికలను పరీక్షించగా వారిలో ఒకరు గుండె సంబంధిత వ్యాధిగ్రస్తురాలిగా ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వం వైద్యశాలలోని కార్డియాలజిస్ట్ ద్వారా పరీక్షలు చేయించాల్సి ఉందని ఆయన తెలిపారు. ఆ బాలిక రక్త నమూనాలను సేకరించి స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు నిర్వహించి గుండు సంబంధిత వ్యాధి ఉన్నట్లు నిర్ధారించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారిని భారతి వైద్య సిబ్బంది చిన్నయ్య విద్యార్థినిలు తదితరులు ఉన్నారు.

## సిలిండర్ పేలి ధ్వంసమైన గృహం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని ఊటుకూరు పంచాయతీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం కాగా తెలుగుదేశం నేతలు ఇంటికి వెళ్లి పరామర్శించారు. శనివారం జరిగిన ఈ సంఘటనతో నేతలు కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకువెళ్లి తగిన సహాయాన్ని అందించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. అలాగే నూతన గృహాన్ని మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడానర్సారెడ్డి చల్లా వెంకటేశ్వర్లు మండల ఉపాధ్యక్షులు ఆనంగి రమణయ్యయాదవ్ ఏగినేని శ్రీనివాసులు కోడూరు నాగిరెడ్డి వనిపెంట వెంకటసుబ్బారెడ్డి నీలం పెరుమాళ్ళు అంకి పెద్దబ్బయ్య నూతలపాటి జయలక్ష్మి కాలనీవాసులు తదితరులున్నారు.

## వరద నీటిని ఎక్కువ విడుదల చేసే అవకాశం

- ప్రమాదం సంభవించినట్లయితే పోలీసులకు తెలపాలి

**సంగం, మేజర్‌న్యూస్ :** పెన్నా నది పరివాహ ప్రాంత గ్రామ మాలైన అన్నా రెడ్డిపాలెం పల్లిపాలెం దువ్వురుపల్లిపాలెం సంగం పల్లె పాలెం ప్రజలకు సోమశిల జలాశయం నుండి వరద నీటిని విడుదల చేస్తున్నారని, అలాగే సంఘం బ్యారేజ్ వద్ద నుండి మూడు గేట్ల ద్వారా ప్రస్తుతం నీరు వదిలి ఉన్నారని ఆ నీటి ప్రవాహం ఇంకా ఎక్కువ అయ్యే అవకాశం ఉందని ప్రజలు తగు ముందు జాగ్రత్త చర్యలు పాటించా లని అదే విధంగా పశువులు కాపరులు గొర్రెల కాపరులు వ్యవసాయ పనులు చేసుకున్న వారు నదిలోనికి వెళ్ళవద్దని ఏదైనా ప్రమాద సంఘటనలు ఉన్న యెడల సంగం ఎస్ఐ 9440796331కి కానీ, సంగం సీఐ సెల్ 9154305605కానీ 112 నంబర్ కానీ ఫోన్ చేసి పోలీసు వారికి తెలియజేయాలని ప్రజలను తెలియజేశారు.

## సిఐటియు మండల మహాసభ

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు మండల కేంద్రం శ్రామిక భవనం కార్యాలయంలో ఆదివారం సిఐటియు మండల ఐదో మహాసభ కార్యక్రమం జరుగుతుందని కృష్ణపట్నం పారిశ్రామిక క్లస్టర్ అధ్యక్షులు గడ్డం అంకయ్య శనివారం మేజర్‌న్యూస్‌కు తెలిపారు. అంగన్వాడి, ఆశా, మధ్యాహ్నం భోజనం పథకం, భవన నిర్మాణ, ఆటో, వీఆర్‌ఏ, పంచాయతీ వర్కర్స్, రోడ్డు మార్జిన్ వ్యాపారస్తులు, కృష్ణపట్నం పోర్టు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, ఆయిల్ ఉత్పత్తి కర్మాగారాలు, లారీ రవాణా విభాగాలకు సంబంధించిన కార్మికులు పాల్గొంటారని క్లస్టర్ అధ్యక్షులు తెలియజేశారు. జిల్లాస్థాయి సిఐటియు నాయకులు విచ్చేస్తున్నట్లు ఆయన అన్నారు.

### ఛానల్ పెడదామని 39 లక్షలు తీసుకొని

# మోసం చేసిన రేవూరి వెంకటస్వామి

- తన పేరుకు బదులుగా తన కూతురు పేరుతో ఛానల్ ప్రారంభం
- నగదు ఎగ్గొట్టాలనే ఆదాలపై రాజకీయ ఆరోపణలు
- విచారించి న్యాయం చేయాలని కోరిన బాధితురాలు కల్లూరి లక్ష్మీరెడ్డిత



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మాజీ పార్ల మెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి దగ్గర పని చేస్తున్న రేవూరి వెంకటస్వామి తనకు పరిచయ మైన కొద్ది కాలానికి యూట్యూబ్ ఛానల్ పెడదా మని తద్వారా కొంతమందికి ఉపాధి, సామాన్య ప్రజలకు న్యాయం చేయగలుగుతామని నమ్మించి 39లక్షల నగదు ఖర్చు పెట్టించి స్రవంతి ఛానల్‌ను 2024లో ఏర్పాటు చేసినట్లు కల్లూరి లక్ష్మీ రెడ్డి తెలిపారు. శనివారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తాను వెంకటస్వామి పూస పూరిత మాటలు నమ్మి తమ బంధువుల దగ్గర అప్పుచేసి అక్షరాల 39లక్షలు వెంకటస్వామికి స్వయంగా ఫోన్ పే ద్వారా ఇవ్వడం జరిగిందని చెప్పారు. నెల్లూరు నగరంలోని స్థానిక స్టోన్ హౌస్ పేట ప్రాంతంలో ఉన్న పప్పుల వీధిలోను, ఫతేఖాన్ పేట ప్రాంతంలో ఉన్న చిరంజీవి అపార్ట్మెంట్లో స్రవంతి యూట్యూబ్ ఛానల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఛానల్ ప్రారంభించిన తర్వాత ఆఫీస్ ఫర్నిచర్, కెమెరాలు, కెమెరామెన్, వీడియో గ్రాఫర్, ఆఫీస్ బాయ్ తదితర ఎంప్లాయిస్‌ను తానే తనకు సంబంధించిన వ్యక్తు లను నియమించుకోవడం జరిగిందని తెలిపారు. 11నెలలు కాలంలో కేవలం 4,5 నెలలు మాత్రమే స్రవంతి ఛానల్ నడిచిందన్నారు. కల్లూరి లక్ష్మీరెడ్డి పేరుతో చానల్‌ను ప్రారంభిం చాల్సి ఉండగా, వెంకటస్వామి తన కూతురు అయిన స్రవంతి పేరుతో కల్లూరి స్రవంతిగా మేనేజింగ్ చైర్మన్ నియమించినట్లు తెలిసింద న్నారు. తన పేరును కేవలం డైరెక్టర్ స్థానంలో ఉంచారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఛానల్ పూర్తిగా ఆగిపోయిన తర్వాత వెంకటస్వామిని నిలదీయగా, తాను నగదును ఖర్చు పెట్టానని, తిరిగి త్వరలో ఇస్తానని చెబుతూ కాలయాపన చేయడం జరిగిందన్నారు. ఈ విషయమై ఆదాల ప్రభాకర్ రెడ్డి కార్యాలయంలో విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా, ఆయన మందలించారని చెప్పారు. నేను వెంకటస్వామి పై 6 నగర పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగిందని, తద్వారా వెంకటస్వామి 39లక్షలు నగదు ఇచ్చేందుకు అంగీకరించారని చెప్పారు. ఇందుకు సంబం ధించి వెంకట్ స్వామి తనకు 20లక్షల చెక్కును ఇచ్చారని, మిగతా బ్యాలెన్స్ అమౌంట్‌కి ప్రామిసర్ నోట్లో రాయించి ఇచ్చారని చెప్పారు. ఇదిలా ఉండగా తాను నగదు ఇవ్వకుండా ఎగ్గొట్టాలని ఆలోచనతోనే మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేరును రాజకీయంగా సమంజసం కాదన్నారు. జిల్లా అధికారులు ఇప్పటికైనా స్పందించి తరుణం మోసం చేసి, 39లక్షలు నగదును తీసుకొని ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న వెంకటస్వామిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### మోడీ తీసుకొచ్చిన పథకాలు.. నిరుద్యోగ యువత

## భవిష్యత్తుకు బంగారు అవకాశాలు

- ల్యాప్‌టాప్, ఇంటర్నెట్ ఉంటే చాలు-ఇంటి నుంచే వ్యాపారం
- చిలక డిజిటల్ సొల్యూషన్స్, సీఈఓ అండ్ ఫౌండర్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** 'డిజిటల్ స్కిల్ ఇండియా' స్వయం, కోర్సులు ద్వారా యువత భవిష్యత్తుకు బంగారు అవకాశం ఉందని 'చిలక డిజిటల్ సొల్యూషన్స్' సీఈఓ అండ్ ఫౌండర్ చిలకా ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. 'ప్రస్తుతం ప్రతి రంగం డిజిటల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైపు పరిగెడుతోంది. డిజిటల్ మార్కెటింగ్, కంటెంట్ క్రియేషన్, వెబ్ డెవలప్‌మెంట్, గ్రాఫిక్ డిజైనింగ్ వంటి నైపుణ్యాలకు భవిష్యత్తులో విపరీతమైన డిమాండ్ ఉంది. నిరుద్యోగ యువత ఈ అవకాశాలను ఉపయోగించుకుంటే ఉద్యోగాలు మాత్రమే కాకుండా స్వయం ఉపాధి కూడా పొందవచ్చు. ఒక ల్యాప్‌టాప్, ఇంటర్నెట్ ఉంటే చాలు–ఇంటి నుంచే వ్యాపారం మొదలుపెట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రధానమంత్రి మోడీ డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, స్వయం వంటి పథకాలు యువతకు మార్గదర్శకాలు అయ్యాయనీ, ముఖ్యంగా డిజిటల్ స్కిల్ ఇండియా, స్వయం పోర్టల్ ద్వారా యువతకు ఉచితంగా అనేక కోర్సులు అందుబాటులో ఉండటం గొప్ప అవకాశం. నేను కూడా ఈ కోర్సులు నేర్చుకొని అదే ప్రేరణతో చిలక డిజిటల్ సొల్యూషన్స్‌ను ప్రారంభించాను. ప్రస్తుతం డిజిటల్ మార్కెటింగ్, ఐఏ యాడ్స్, వెబ్ డెవలప్‌మెంట్, బ్రాండింగ్, కంటెంట్ క్రియేషన్ వంటి విభాగాల్లో సేవలు అందిస్తోంది' అన్నారు. 'ఈ అవకాశాలను వదులుకోకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకోండి. స్వయం పోర్టల్ ద్వారా కోర్సులు నేర్చుకొని, డిజిటల్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోండి. ఇదే భవిష్యత్తును సురక్షితం చేసే మార్గం' అని తెలిపారు.

# అభివృద్ధికి అడ్డుపడకుండా సహకరించండి



- డీఆర్ ఛానల్ వద్ద ఆక్రమించిన మూడు ఎకరాలను ప్రభుత్వానికి అప్పగించండి
- దగదర్తి - బుచ్చి రోడ్డుకు అవసరమైన స్థలాన్ని రోడ్డుకు కేటాయించండి
- కమిషన్ లేనిదే మాలేపాటి సోదరులు పనిచేయరు
- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి

**దగదర్తి, మేజర్‌న్యూస్ :** దగదర్తి మండలంలో జరుగుతున్న అభివృద్ధికి అడ్డుపడకుండా సహక రించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి మాలేపాటి సోదరు లకు పిలుపునిచ్చారు. శనివారం మనుబోలు పాడులోని వారి నివాసంలో జరిగిన విలేఖరుల సమావేశంలో రవికుమార్ చౌదరి మాట్లాడుతూ గత వారం రోజులుగా డీఆర్ ఛానల్ పనులపై మాలేపాటి సోదరులు చేస్తున్న ఆరోపణలపై స్పష్టతనిచ్చారు. 2018లో డీఆర్ ఛానల్ టెండర్ పిలవబడగా, సుబ్బనాయుడు ఆ టెండర్‌లో పాల్గొన్నారన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చాక రివర్స్ టెండరింగ్‌లో 4.16 శాతం తక్కువ బిడ్ వేసి కేఎంఆర్ మధు రెడ్డి పనిని తీసుకున్నారన్నారు. ఆ కాలంలో బిల్లులు రాకపోవడంతో ఉద్దేశ్యపూర్వకంగా పనులు నిలిపివేశారని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి కాంట్రాక్టర్‌ను పిలిపించి బిల్లులు చెల్లించే చర్యలు చేపట్టగా, అవసరమైతే స్వంత నిధులతోనైనా పనులు పూర్తిచేయాలని ఎమ్మెల్యే ముందుకు వచ్చారని వెల్లడించారు. దీంతో ఐదు నెలల్లో 85 శాతం వరకు పనులు పూర్తయ్యాయ న్నారు. మాలేపాటి సోదరులు ఐదు నెలల తర్వాత పనుల నాణ్యతపై అవినీతి ఆరోపణలు చేయడం అన్యాయం అని పేర్కొన్నారు. వారు కాలువ వద్ద భూముల ఆక్రమణ చేపట్టారని, 3 ఎకరాల శివాయి ఆక్రమణ చేపట్టారని సర్వే నివేదికను వెల్లడించారు. సుబ్బనాయుడు, రవీంద్ర నాయుడు కుటుంబాలు కమిషన్లతో లాభపడినట్లు రవికుమార్ ఆరోపించారు. బిఎంఆర్ ఫ్యాక్టరీ భూమి, ఇతర డీలింగ్స్‌లో డబ్బులు తీసుకున్న విషయాలు గుర్తు లేవా? అని అన్నారు. దగదర్తి మండలంలో ఇప్పటికే రూ.150 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నా యని, ఎమ్మెల్యే పనితీరును దెబ్బతీయాలనే ఉద్దేశంతో మాలేపాటి సోదరులు బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. సొంత పట్టా భూములు అవసరం లేదని, కాలువ వద్ద ఆక్రమించిన శివాయి భూములు ఇస్తే సరిపోతుందని తెలిపారు. అంతేకాకుండా దగదర్తి – బుచ్చి రోడ్డుకు అవసరమైన పొలాన్ని రోడ్డుకు అందజేసి పోతున్న ప్రాణాలను కాపాడాలని కోరారు. ఇకపై అసభ్య పదజాలం వాడితే మాలేపాటి రవీంద్రపై తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దగదర్తి మండల టీడీపీ అధ్యక్షులు అల్లం హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి వింజం కొండప నాయుడు, జలదంకి శ్రీహరి నాయుడు, పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో మెగా లోక్ అదాలత్



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఏ. గీతావాణి హాజరయ్యారు. అనంతరం పెండింగ్లో ఉన్న కేసులు, కుటుంబ వివాద కేసులు, బ్యాంకు బకాయి కేసులు, సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్ కేసులు ఈ లోక్ కదా ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. మీడియేషన్ ద్వారా చేసుకుంటే ఆర్థిక భారం సమయం ఆదా అవుతుందని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు లోక్ అదాలత్ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునని వారు తెలిపారు. అలాగే లోకదాలతో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఈ సుధాకర్ పాల్గొని సుమారు 105 సివిల్ క్రిమినల్ చెక్ బౌన్స్, బ్యాంకు బిఎస్ఎన్ కేసులు సుమారు 43,34,500 నగదును పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కే.చక్రపాణి కార్యదర్శి ఋషికుమార్ మెంబర్ ఐ.సాయిప్రసాద్, శ్రీదేవి, కెనడి, పి.ప్రసాద్, బాబురావు బాలాజీ, ప్రసన్నకుమార్, జయలక్ష్మి, జూనియర్ న్యాయవాదులు పోలీసులు, వివిధ బ్యాంకుల సిబ్బంది, కోర్టు సిబ్బంది, కక్ష దారులు పాల్గొన్నారు.

## సభలు, సమావేశాలకు ఏలాంటి అనుమతుల్లేవు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి సర్కిల్ పరిధిలోని సీతారామ పురం, ఉదయగిరి, వరికుంట పాడు, దుత్తలూరు మండలాల్లో పోలీసు సెక్షన్ 30 అమల్లో ఉన్నందున సభలు, సమావేశాలు, పరామర్శలకు ఏలాంటి అనుమతుల్లేవని సీఐ ఎన్.వెంకటరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల వరికుంటపాడు మండలంలోని కనియంపాడు, భాస్కరావపురం, జంగంరెడ్డిపల్లి గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కావడం, అలాగే ఉదయగిరి మండలం అప్పసముద్రంలో వినాయక విగ్రహ నిమజ్జనోత్సవంలో ప్రమాదవశాత్తు బాణసంచా పేలి 9మంది చిన్నారులు గాయపడిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపట్టామన్నారు. ఆయా గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## జమునకు అవార్డు ప్రధానం

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుని మొగిలిశెట్టి జమున కళారంగంలో ఎక్కువ మక్కువ ఉపాధ్యాయుని సెప్టెంబర్13 తేదీన హైదరాబాదులో ఆర్ట్ ఆఫ్ లర్నింగ్ వారు హైదరాబాదులో నిర్వహించిన తెలివి తెలుగు కీర్తి కిరీటాల అంతర్జాతీయ పురస్కారాల అవార్డును అందుకున్నారు. కావలి పట్టణ ప్రజలు తోటి ఉపాధ్యాయులు, విశ్రాంతి ఉపాధ్యాయులు, వారిని అభినందించారు.



# విద్యార్థులే నారాయణ బ్రాండ్ అంబాసిడర్‌లు

## యాస్పైర్ సమ్మిట్ 2.0లో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్‌లు పొంగూరు రమాదేవి, గంట రవితేజ

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ 46 ఏళ్ల ప్రస్థానంలో ఖచ్చితమైన విద్యా ప్రమాణాలను పాటించే ఒకే ఒక్క విద్యాసంస్థగా నారాయణ నిలుస్తుందని, నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పొంగూరు రమాదేవి, గంట రవితేజ అన్నారు. శనివారం విజయవాడ నగరంలో జరిగిన ఎస్పైర్ సమ్మిట్ 2.0 కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రమాదేవి, రవితేజలతోపాటు జీఎం వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల ఉన్నతికి నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో వివిధ రకాల నూతన బోధన పద్ధతులు అవలంబిస్తున్నామన్నారు. అందుకు నారాయణ ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. నారాయణ ఈ కిడ్జ్ ఈ చాంప్స్, హై స్కూల్స్‌లో అంకిత భావంతో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఇక్కడకు రావడం శుభ పరిణామమన్నారు. అదేవిధంగా మేనేజ్మెంట్ నిర్ణయించిన డ్రాపఔట్ టార్గెట్ పూర్తి చేసిన స్కూల్స్‌కీ ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. ఎప్పుడైతే అకాడమిక్ పర్ఫెక్ట్ గా రన్ అవుతుందో అక్కడ డ్రాపట్స్ తగ్గి, టీచర్స్ స్టాండర్డ్‌గా నిలబడతారన్నారు. అంతేకాకుండా ఎప్పుడైతే ఉపాధ్యాయులు స్కూల్స్‌లో స్థిరంగా ఉంటారో ఆ స్కూల్స్ మీద తల్లిదండ్రులకు మంచి అభిప్రాయం




ఏర్పడుతుందని తద్వారా మరొకరికి స్కూల్ గొప్పతనాన్ని వివరించే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి స్కూల్స్‌లో చేర్చేందుకు తల్లిదండ్రులు కూడా ఇష్టపడతారని అలానే స్కూల్స్ గ్రేడ్ పెరుగుతుందనీ తెలిపారు.దానితో పాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులు స్థిరమైన నిర్ణయాలు తీసుకుని కేజీ నుండి పీజీ వరకు ఇక్కడే విద్యను అభ్యసిస్తారన్నారు. నారాయణలో ఈ కిడ్జ్ లోని నర్సరీలో చేరిన విద్యార్థులు , ఈ చాంప్స్ ద్వారా ప్రైమరీ లో చేరి అక్కడ నుండి ఈ టెక్నో ప్రోగ్రాం ద్వారా హై స్కూల్‌లో స్టాండ్ అయ్యి అక్కడ నుండి ఒలంపియాడ్, మెడికల్ ప్రోగ్రాం ఎంచుకొని ఇంటర్మీడియట్లో ఎంపీసీ, బైపీసీలో ఐఐటీ, మెడికల్ సీట్లు సులభంగా సాధించి నారాయణకు ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటారన్నారు. ఈ సందర్భంగా బెస్ట్ స్కూల్స్ అవార్డులను ప్రకటించి అందజేశారు.అకాడమిక్ ప్రోగ్రామ్ను చక్కగా నిర్వహించి డ్రాప్ అవుట్స్ తగ్గించి బెస్ట్ స్కూల్స్‌గా రాష్ట్రస్థాయిలో నెల్లూరుకు చెందిన నారాయణ గోమతి సీబీఎస్ఈ స్కూల్, నారాయణ ఒలంపియాడ్ స్కూల్ సీబీఎస్సీ స్కూల్ ఎంపికవుగా వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్స్ ఏజీఎంలు డీజీఎంలు ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గౌడ యువజన ఆత్మీయ సమావేశం.. నూతన కమిటీ ఎన్నిక



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నగరంలోని రాయల్ పార్కులో గౌడ యువజన ఆత్మీయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గౌడ సంఘం సీనియర్ నేతలు మాజీ కౌన్సిలర్ ఉదయగిరి నరసింహ గౌడ్, అన్నం దయాకర్ గౌడ్, బుర్ర వెంకటేశ్వర్లు గౌడ్, వెంపులూరు భాస్కర్ గౌడ్, నడవడి ముత్యం గౌడ్ , ఏపూరి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ సంఘీయులందరినీ ఒక్క తాటిమీద తీసుకొని వచ్చి వారి సమస్యల మీద పనిచేసేందుకు గౌడ యువజన ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌడ సంఘం యువజన విభాగం అధ్యక్షులుగా -తిరకాల మోహన్ బాబు గౌడ్, ఉపాధ్యక్షులుగా తాత హేమంత్ గౌడ్, తిరకల శివ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా -దద్దోలు పవన్ తేజ్ గౌడ్, ఉప్పల మహీంద్రా గౌడ్, ఆర్గనైజర్ కార్యదర్శిగా కోసూరు వంశీ గౌడ్,ఆర్గనైజర్ కార్యదర్శిగా -రావుల దినేష్ గౌడ్, ట్రెజరర్‌గా దాసరి హేమంత్ గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి దద్దోలు మహేంద్ర, ఎగ్జిక్యూటివ్ మెంబెర్‌లుగా - కోసూరు అశోక్ గౌడ్, తాత బాలకృష్ణ గౌడ్, పంది బాలాజీ గౌడ్, బడుగు వినోద్ కుమార్ గౌడ్, బడుగు శ్రీను గౌడ్‌లను ఎన్నుకున్నారు

# విషజ్వరాలపై తక్షణ చర్యలకు మంత్రి ఆనం ఆదేశాలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని బాలికల గురుకుల పాఠశాలలో పలువురు విద్యార్థినిలకు విషజ్వరాలు ప్రబలాయన్న సమాచరం, ప్రచారంతో వెంటనే చర్యలు తీసుకోవాలని శనివారం రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. అధికంగా విద్యార్థినిలకు విషజ్వరాలు ప్రబలాయన్న కలకలంతో మంత్రి ఆనం జిల్లా కలెక్టర్‌తో, జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. విషజ్వారాలపై అందరూ వెంటనే స్పందించి తగు సత్వర చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఆయన సూచించారు. తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్ హిమాన్షుశుక్లాను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో జిల్లా యంత్రాంగం



ఆత్మకూరుకు తరలివచ్చారు. పరిస్థితిని సమీక్షించారు. వైద్యశిబిరం ఏర్పాటు చేయించారు. విద్యార్థినిలతో మాట్లాడారు. స్కూల్ ఆవరణ, గదులు, వంటశాల, మరుగుదొడ్లు తదితరాలను వారు పరిశీలించారు. విషజ్వరాలు సోకినవారిని వైద్యశాలకు తరలించి వైద్యసేవలందించసాగారు. అయితే విషజ్వరాలు సోకిన విద్యార్థినిల ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసం లేదని అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో ఇలాంటి పరిస్థితిలు, సంఘటనలు రాకుండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి రామనారాయణరెడ్డి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వారికి అందించే ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కూడా ఆయన ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం చేసేత్తు కఠినచర్యలుంటాయని మంత్రి ఆనం హెచ్చరించారు.

## ఘనంగా కిరణ్ దీక్షితులు జన్మదిన వేడుకలు



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానం ముఖ్య అర్చకులు కిరణ్ దీక్షితులు జన్మదిన వేడుకలు శనివారం నెల్లూరు నగరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రగతి చారిటీస్ లో చిరంజీవి బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో కిరణ్ దీక్షితులు జన్మదిన వేడుకలను పిల్లల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కిరణ్ దీక్షితులు జన్మదినోత్సవాన్ని పిల్లల మధ్య నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సివి అసోసియేట్స్ సివి, నివాభాషా హెల్త్ ఇన్సూరెన్స్ మేనేజర్ పోలంరెడ్డి పెంచల బాబు తదితరులు పాల్గొన్నారు.

## కావలికి కొత్తగా ముగ్గురు న్యాయవాదులు

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి మద్దురుపాడు చెందిన మాజీ ఏఎంసీ డైరెక్టర్ పులిచక్రపాణి అలాగే అవార్డు మాజీ కౌన్సిలర్ పులి రజిని, రమేష్ ఇటీవల న్యాయవాది విద్యాభ్యాసంలో ఉత్తీర్ణులు కావడం జరిగింది. మూడు సంవత్సరాల లా కోర్సు విజయవంతంగా పూర్తి చేసుకుని శనివారం అమరావతిలోనే హైకోర్టు బార్ కౌన్సిలర్ కౌన్సిల్ ఆఫ్



ఆంధ్ర ప్రదేశ్ నుంచి ప్రయోజనాలు ఆఫ్ ఎన్రోల్మెంట్ యాజ న్యాయవాదులుగా ప్రమాణం చేసి సర్టిఫికెట్లను పొందారు. పొందిన వారు చక్రపాణి, రజిని, రమేషు ముగ్గురు కావలి పట్టణంలోని మధురపాడులో ఒకటో వార్డు కావడం విశేషం. కావలి పట్టణ తోటి లాయర్లు స్నేహితులు వారిని చరవాణి ద్వారా అభినందించారు.

### పులివర్తి రాఘవ నాయుడు, వెంకటసుబ్బమ్మ

## మెమోరియల్ టోర్నమెంట్



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో పులివర్తి రాఘవ నాయుడు వెంకటసుబ్బమ్మ మెమోరియల్ ఉమ్మడి నెల్లూరు జిల్లా టెన్నిస్ డబల్ టోర్నమెంట్ జోహార్ భారతి కళాశాల ప్రాంగణం నందు తన కుమారులు పులివర్తి భాస్కరరావు, ఇరువురు సోదర కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నెల్లూరు జిల్లాలో ఉన్న క్రీడాకారులు అందరూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈశ్వర దొడ్ల వినయ్ కుమార్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సుబ్రహ్మణ్యం నాయుడు ప్రిన్సిపల్ జవహర్ పార్టీ డిగ్రీ కళాశాల వారి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 50మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్లో 40 సంవత్సరాల లోపు పురుషులు 40 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల వరకు, 50 సంవత్సరాలు పైబడిన క్రీడాకారుల విభాగాలలో ఈ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది.అనంతరం క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం జవహర్ భారతి కళాశాల పిడి డాక్టర్ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

# లోక్అదాలత్‌లో 71కేసులు పరిష్కారం






**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని కోర్టులో సీనియర్‌సివిల్‌జడ్జి బి.గాయత్రి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్అదాలత్‌లో వివిద రకాలైన 71కేసులు రాజీమార్గంలో పరిష్కారమయ్యాయి. ఈసందర్భంగా న్యాయమూర్తి గాయత్రి ప్రసంగిస్తూ క్లయింట్లు రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకునేందుకు లోక్అదాలత్ మంచి వేదిక అన్నారు. కేసుల రాజీ వలన క్లయింట్లకు వ్యయ,ప్రయాసల బెడద తప్పుతుందన్నారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను ఇరువర్గాల క్లయింట్లు సమ్మతితో లోక్అదాలత్‌లో పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. ప్రభుత్వం తరచూ లోక్ అదాలత్‌లను నిర్వహిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో 18సివిల్‌కేసులు, 45క్రిమినల్ కేసులు, 8బ్యాంక్‌కేసులు పరిష్కారమయ్యాయని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో జూనియర్ సివిల్‌జడ్జి ఎల్.జగదీష్‌కుమార్, లోక్అదాలత్ మెంబర్స్ ఏ.తిరుపతమ్మ, కె.కిరణ్‌కుమార్, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, క్లయింట్లు తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ సీతారామ్ ఏచూరికి ఘననివాళులు






**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సిపిఎం అఖిలభారత ప్రధానకార్యదర్శి, దివంగత కామ్రేడ్ సీతారామ్‌ఏచూరికి ఆత్మకూరులో సిపిఎం, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు ఘననివాళులర్పించారు. స్తానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీతారమ్‌ఏచూరి వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధాన వక్త మోహన్‌రావు మాట్లాడుతూ ఏచూరి జీవిత విశేషాలు, ఆయన సారధ్యంలో సాగిన పోరాటాలు, సాధించిన విజయాలను గురించి వివరించారు. ఈకార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి కె.డేవిడ్‌రాజు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మెన్ షేక్ సంధాని, నాయకుడు నాగేంద్ర, ఐద్వా నాయకురాలు గుల్జార్‌బేగమ్, ఆవాజ్ జిల్లాకమిటీ సభ్యులు పి.యస్థాని, సిఐటియు, ఇతర అనుబంధ సంఘాల నాయకులు కొండమూరు హజరత్తయ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వరల్డ్ ఫస్ట్ ఎయిడ్ డే సదస్సు




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గౌదంగవే కమాండింగ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, వెంగళ రావు నగర్, నెల్లూరు నందు ఎన్ సి సి సెకండ్ ఆఫీసరుగా విధులు నిర్వహిస్తున్న గుండాల నరేంద్ర బాబు అసోసియేట్ ఎన్ సి సి ఆఫీసర్ ఆధ్వర్యంలో వరల్డ్ ఫస్ట్ ఎయిడ్ డే అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రీనా భారతి ముఖ్య అతిధిగా విచ్చేసి ఎన్ సి సి క్యాడేట్లకు ఫస్ట్ ఎయిడ్ యొక్క ఆవశ్యకత గురించి ప్రాణాపాయంలో ఉన్న వ్యక్తిని ఎలా ఫస్ట్ ఎయిడ్ చేసే టప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సమీపంలో ఉన్న వైద్యుని కలిసేలోపు ప్రమాదంలో ఉన్న వారి ప్రాణాలను ఎలా కాపాడాలో చక్కని తన ఉపన్యాసం ద్వారా అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరి దగ్గర తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలన్నారు. ప్రమాదాలు సంభవించి నప్పుడు ప్రమాదాలకు గురైన వారి ప్రాణాలను కాపాడుటకు ఆసుపత్రికి తీసుకెళ్లే లోపు సమీపంలో ఉన్న వారు చేసే ప్రాథమిక చికిత్స ఎంతో అమూల్యమైనదని ప్రాథమిక చికిత్స గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉన్నప్పుడే వారి ప్రాణాలను కాపాడుటకు వీలౌతుందన్నారు. ఆపద కాలంలో ఆదుకోవడంలో ఎన్‌సిసి కేడేట్లు ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. ఈ సందర్భంగా గుండాల నరేంద్ర బాబు మాట్లాడుతూ.. అంతర్జాతీయ రెడ్ క్రాస్సంస్థ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ రెండవ శనివారాన్ని వరల్డ్ ఫస్ట్ ఎయిడ్ డే నిర్వహించడం ద్వారా అంతర్జాతీయ సమాజాన్ని చైతన్య పరిచేలా చర్యలు చేపట్టిందనారు. బాల్యం నుంచే బాలలందరూ ప్రాథమిక చికిత్సపై పూర్తి అవగాహన కలిగి ఉండాలనే సదాశయంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయిని సి. మంజుల వాణి,వైద్య సిబ్బంది, ఎన్ సి సి కేడేట్లు పాల్గొన్నారు.

## సన్ షైన్ రేకుల పరిశ్రమలో ప్రమాదం.. ఒకరు మృతి

**గూడూరు, మేజర్‌న్యూస్ :** గూడూరు రూరల్ పరిధిలోని తుంగపాలెం వద్ద కలర్ షైన్ రేకుల పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదంలో కార్మికుడు మృతి చెందారు. శనివారం ఉదయం జరిగిన ప్రమాదంలో పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యంమే కారణం అన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలు తరచూ వింటూనే ఉన్న అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై కవరేజ్‌కి వెళ్లిన మీడియా ప్రతినిధులపై కూడ పరిశ్రమ ప్రతినిధులు దురుసుగా ప్రవర్తించడంతో కంపెనీ గేటు ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు సర్దుబాటు చేసి లోపలికి వెళ్లేందుకు అనుమతి ఇచ్చినా ఫోటోలు తీయకుండా అడ్డుకున్నారు. ప్రమాదం లో గాయపడిన వారికి ప్రైవేటు ఆసుపత్రికి తీసుకుని వెళ్లారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కిషోర్ బాబు తెలిపారు. మండల తహసీల్దార్ ప్రసాద్ తదితరులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితి పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ ఆర్ఆర్ఆర్ స్వాగతం పలికిన తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి

**రేణిగుంట, మేజర్‌న్యూస్ :** తిరుపతి వేదిక జరగనున్న జాతీయ మహిళా సాధికారత సదస్సులో పాల్గొనడానికి విచ్చేసిన రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజుకు స్వాగతం పలికిన తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్, టీ.టి.డి బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి రేణిగుంట విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు.

## ముక్కంటి సేవలో చంద్ర కాళీ ప్రసాద మాతాజీ

**శ్రీకాళహస్తి అర్బన్, మేజర్‌న్యూస్ :** గుంటూరు జిల్లా నంబూరు కాళీ వన ఆశ్రమ పీఠాధిపతులు యోగిని చంద్రకాళి ప్రసాద మాతాజీ శనివారం శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. శిష్య బృందంతో కలిసి ఆలయానికి విచ్చేసిన పీఠాధిపతులకు ఆలయ అధికారులు వారికి దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శించుకున్న పీఠాధిపతులు తిరిగి ఆశ్రమాన్ని బయలుదేరు వెళ్లారు. కార్యక్రమంలో ప్రోటోకాల్ ఏఈవో మోహన్, ఆలయ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, శుక బ్రహ్మాశ్రమం మేనేజర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

## చిత్తూరు అభివృద్ధికి సహకరించండి

- పర్యాటక రంగానికి పెద్దపీట వేయండి
- రాష్ట్ర మంత్రి దుర్గేష్ విజ్ఞప్తి చేసిన చిత్తూరు 20వ డివిజన్ కార్పొరేటర్ అశోక్

**చిత్తూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్ :** జిల్లా కేంద్రమైన చిత్తూరు నగర అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర పర్యాటక, సినీ టోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ కు విజ్ఞప్తి చేశారు చిత్తూరు కార్పొరేటర్ అశోక్.. అంతేకాకుండా పర్యాటక రంగానికి పెద్దపీటవేయాలని విన్నవించారు. చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ ఆదేశానుసారం. శనివారం తిరుపతి పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ను చిత్తూరు నగర కార్పొరేటర్ అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ నేతృత్వంలో చిత్తూరు ప్రగతి పథంలో పయనిస్తుందని.., పర్యాటక రంగానికి అనుకూలంగా ఉన్న చిత్తూరు జిల్లాను అన్ని రకాల అభివృద్ధి చేయాలని అశోక్.. మంత్రికి తెలియజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్.. చిత్తూరు నియోజకవర్గ అభ్యున్నతికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. అదే సమయంలో జిల్లా కేంద్రమైన చిత్తూరును టూరిజం హబ్బుగా తీర్చిదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోందన్నారు. అనంతరం కార్పొరేటర్ అశోక్ మాట్లాడుతూ చిత్తూరు నియోజకవర్గం పై ప్రత్యేక దృష్టి సారించి, అన్ని రకాల అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సూచనలతో, తాను రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ కలిసినట్లు వివరించారు. పర్యాటక రంగాన్ని వృద్ధి చేసేందుకు అన్ని రకాల అనువైన ప్రాంతం చిత్తూరని.., ఇందుకు సహకరించాలని కోరుతూ తాను మంత్రికి వినత పత్రం సమర్పించినట్లు వివరించారు. చిత్తూరు సర్వతో ముఖాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి దుర్గేష్ తనకు తెలియజేసినట్లు 20వ డివిజన్ కార్పొరేటర్ అశోక్ తెలిపారు.

## మర్రిపాడులో..



# నిలువ నీడ కరువాయే !

**జిల్లా సరిహద్దు ప్రాంతంలో బెంగళూరు-ముంబై జాతీయ రహదారిపై ప్రధానమైన సెంటర్ మర్రిపాడు సెంటర్. అటు కడపకు ఇటు నెల్లూరుకు మర్రిపాడు కీలకమైనది. అలాంటి తరుణంలో ప్రయాణికులకు బస్సు షెల్టర్ కరువు అవడంతో ఎండలోనూ, వానలోనూ నిల్చుని పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పాటుగా మహిళలకు మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడక తప్పడం లేదు. అంతేకాకుండా త్రాగు నీటికి అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్ప డింది. అటు అధికారులు ఇటు ప్రభుత్వాలు మారుతున్న కనీసం మర్రిపాడు సెంటర్లో బస్సులు నిర్మించకపోవడం దారుణమని మండల ప్రజలు పెదవి విరుస్తున్నారు. వివరాల్లోకి వెళితే..**

- ఎండలోనూ, వానలోనూ నిల్చుండాల్సిందే
- మహిళలకు మరుగుదొడ్లు కరువు
- త్రాగునీటికి తప్పని అవస్థలు
- మర్రిపాడు సెంటర్లో ప్రయాణికుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** జిల్లాలో చిట్టచివరి మండలం మర్రిపాడు మండలం. ఈ మండలం పొడవునా నెల్లూరు– ముంబై జాతీయ రహదారి ఉంది. ఈ రహదారిలో నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. అంతేకాకుండా మండలంలోని ప్రజలు అటు కడపకు గాని ఇటు నెల్లూరుకు గాని ప్రయాణం సాగిస్తుంటారు. అలాంటి తరుణంలో మర్రిపాడు బస్సులను ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో మర్రిపాడు సెంటర్లో బస్టాప్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండలోను వానలోనూ నిలుచుకుని పడిగాపులు గాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకపోతే మహిళలకు మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో పాటుగా త్రాగునీరు కూడా కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్క మర్రిపాడు మండలం ప్రజలే కాకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులతో పాటుగా కార్లలో ప్రయాణించే వాళ్ళు, ఆటోలో, ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులు కూడా కాసేపు సెంటర్లో సేదదీరేందుకు,త టిఫిన్ భోజనాలు చేసేందుకు ఆగుతుంటారు. ఈ నేపథ్యంలో నిలుచు కొనేందుకు నీడ కూడా కరువు అవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే దుకాణాల్లోకి వెళ్లి దతలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా విపరీతమైన ఎండకు రహదారిలోనే నిలుచొని ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఈ సమస్య సంవత్సరాలద తరబడి నుండి ఉన్నప్పటికీ అటు పాలకులు గానీ ఇటు ప్రభుత్వాలు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా మర్రిపాడు సెంటర్లో వర్షాలతోపాటు మహిళలకు మరుగుదొడ్ల నిర్మాణాలను ఏర్పాటు చేయాల్సిందిగా పలువురు కోరుతున్నారు.


సూర్య

## విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

**కావలసిన సెంటర్లు**

నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

**నేటి దినపత్రిక సూర్య కార్యాలయం**
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు

**9000118811, 9000483583**


## నెల్లూరు జిల్లా నూతన ఎస్పీగా అజిత వేజెండ్ల



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నూతన ఎస్పీగా అజిత వేజెండ్ల ఐపీఎస్ బాధ్యతలు స్వీకరించనున్నారు. నెల్లూరు జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న జి.కృష్ణకాంత్‌ను బదిలీ చేస్తున్నట్లు ఆయన స్థానంలో జిల్లా నూతన ఎస్పీగా అజిత వేజెండ్లతను నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి శనివారం ఉత్తర్వులు వెలుపడ్డాయి.

## మెగా లోక్‌అదాలత్ ద్వారా.. 8920 కేసులు పరిష్కారం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తికి రాష్ట్రస్థాయిలో ప్రశంసలు

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం నాడు జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో కనీవినీ ఎరుగని విధంగా కేసులు పరిష్కారం అయ్యాయి జిల్లా వ్యాప్తంగా మొత్తం 8920 కేసులు పరిష్కారం కాగా దాదాపు 8195 కేసులు ఒక్క నెల్లూరు నగరంలోనే పరిష్కారమయ్యాయి. గూడూరులో 45, కోవూరులో 142, కావలిలో 96, వెంకటగిరిలో 100, కోటలో 47, నాయుడుపేటలో 63, సూళ్లూరుపేటలో 64, ఆత్మకూరులో 69, ఉదయగిరిలో 62 కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా న్యాయమూర్తులు న్యాయవాదులు కక్షిదారులు జిల్లా అధికారులు పాల్గొన్నారు ముఖ్యంగా నెల్లూరు మున్సిపల్ కమిషనర్ కార్యాలయానికి చెందిన డిప్యూటీ కమిషనర్ డి.చెన్నుడు, విద్యుత్ శాఖకు చెందిన ఆంజనేయ రెడ్డి, పంచాయతీరాజ్ సంబంధించి అధికారి







శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొని వారికి సంబంధించిన కేసులు పరిష్కరించారు. నెల్లూరు మున్సిపల్ కార్యాలయానికి సంబంధించి ఒక కోటి 12 లక్షల రూపాయలు లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమై పన్నుల రూపంలో కార్యాలయానికి చేరింది. అలాగే విద్యుత్ శాఖకు చెందిన బకాయిలు 33 లక్షల రూపాయలు జిల్లా పంచాయతీరాజ్‌కు సంబంధించి ఒక కోటి 66 లక్షలు వసూలయ్యాయి అలాగే పలు ఇన్సూరెన్స్ కంపెనీలకు సంబంధించిన కేసులు పరిష్కారమయ్యాయి లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం పట్ల న్యాయవాదులు కక్షిదారులు తీవ్ర సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన న్యాయమూర్తులు పాల్గొన్నారు. అలాగే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కే.వాణి బార్ కౌన్సిల్ సభ్యులు వేనాటి చంద్రశేఖర రెడ్డి బార్ అసోసిషన్ అధ్యక్షులు పి.అయ్యప్ప రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీస్ శాఖకు చెందిన అధికారులు సిబ్బంది క్రిమినల్ కేసుల పరిష్కారంలో తీవ్రంగా కృషి చేశారు. అధికారులందరికీ ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ అభినందనలు తెలిపి జ్ఞాపిక అందించారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి సర్పంచ్ కృషి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని ఏకిస్తీపురం పంచాయతీ పరిధిలోని చింతలపాలెం గ్రామంలోని బీసీ కాలనీలో గత కొద్ది నెలలుగా నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి సర్పంచ్ దాట్ల రమణారెడ్డి నూతన బోరు ఏర్పాటు చేశారు. శనివారం బోరుకు మోటారును ఏర్పాటు చేశారు. బోర్ వద్ద నుండి పైపు లైన్ ఏర్పాటుకు జెసిబి తో పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కాలనీ త్రాగు నీటి సమస్యకు పరిష్కారంకు తన వంతు కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

## కోనకాలువ శుభ్రం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పట్టణ ప్రజల దాహార్తి తీర్చే కోనకాలువను సర్పంచ్ సామ్రాజ్యం, ఉపసర్పంచ్ ముర్తుజా, డిప్యూటీ ఎంపీడీవో షేక్ కరీముల్లాల ఆదేశాల మేరకు శనివారం పంచాయతీ పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా దుర్గంపై గల తొట్టెలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం దుర్గంపై నుంచి పట్టణంలోని దర్గా వరకు ఉన్న కాలువ వెంబడి పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు.